ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 41 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
ఆదివారం 15 సెప్టెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# మీ వద్దకు రాకుండా నన్ను ఏదీ ఆపలేదు.. ప్రధాని మోదీ

### ప్రజల వద్దకు చేరుకోనివ్వకుండా తనను వర్షమే కాదు.. ఏదీ ఆపలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివారం ఆయన రాంచీ నుంచి రోడ్డు మార్గంలో జెంషెడ్‌పూర్ చేరుకున్నారు.



జెంషెడ్‌పూర్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: తాను ప్రజల వద్దకు చేరుకోవడాన్ని భారీ వర్షమే కాదు.. ఏదీ ఆపలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దిల్లీ నుంచి రాంచీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో అక్కడి నుంచి దాదాపు 126కి.మీల మేర రోడ్డు మార్గంలో జెంషెడ్‌పూర్ చేరుకున్నారు. ఈ ఏడాది చివరిలో ఝార్ఖండ్‌కు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ అక్కడి గోపాల్ మైదాన్‌లో భాజపా నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించారు. "భారీ వర్షంతో పాటు ఏ అవరోధాలు మీ వద్దకు రాకుండా అడ్డుకోలేవు. మీ ఆప్యాయత నా హృదయాన్ని తాకింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విపక్షాలు కుట్రలు చేసినా.. ప్రజలు మాత్రం భాజపాకే పట్టం కట్టారు" అన్నారు.

### కాంగ్రెస్ అవినీతి బడిలో జేఎంఎం శిక్షణ

"కాంగ్రెస్-జేఎంఎం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయి. జేఎంఎం ప్రభుత్వం కాంగ్రెస్ అవినీతి పాఠశాలలో శిక్షణ తీసుకుంది. గనులు, ఖనిజాలు, సైనిక భూములను దోపిడీ చేసిన జేఎంఎం . పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఇదే. భాజపా అధికారంలోకి వస్తే ఎక్సైజ్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ డ్రైవ్లో అభ్యర్థుల మరణాలపై దర్యాప్తు చేస్తుంది. జేఎంఎం ప్రభుత్వం భాజపా నేతలను టార్గెట్ చేసుకొంటూ.. వారిని తప్పుడు కేసుల్లో ఇరికిస్తోంది. ఉద్యోగాలను విక్రయించే ముఠాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి" అని ఆరోపించారు. అంతకుముందు రాంచీలో ప్రధాని మోదీ ఆరు వందే భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపి వర్చువల్ ప్రారంభించిన విషయం తెలిసిందే.

### ఝార్ఖండ్‌కు అతిపెద్ద శత్రువులు వారే..

ఝార్ఖండ్‌లో జేఎంఎం ప్రభుత్వం వనరులను దోచుకుంటోంది. గతంలో మేం అధికారంలో ఉన్న సమయంలో జిల్లా ఖనిజ నిధి ద్వారా మీ హక్కులకు భరోసా ఇచ్చాం. అధికార దాహంతో ఉన్న జేఎంఎం, ఆర్జేడీ, కాంగ్రెస్ ఝార్ఖండ్‌కు అతిపెద్ద శత్రువులు. ఝార్ఖండ్‌లో చొరబాట్లు అతి పెద్ద సవాల్ ఉన్నా.. జేఎంఎం సారథ్యంలోని కూటమి ప్రభుత్వం దాన్ని అంగీకరించేందుకు ఇష్టపడటంలేదు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు రాష్ట్ర జనాభా సంఖ్యలో మార్పు తీసుకొస్తుంది. ఇక్కడి ప్రజలు అభద్రతతో ఉన్నారు" అని తెలిపారు.

# జగన్ లాంటి అసమర్థ వ్యక్తి అప్పుడు సీఎం ఎలా అయ్యారో?: మంత్రి సత్యకుమార్

### జగన్ లాంటి అసమర్థ వ్యక్తి అప్పుడు సీఎం ఎలా అయ్యారో అని మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: జగన్ లాంటి అసమర్థ వ్యక్తి అప్పుడు సీఎం ఎలా అయ్యారో అని మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు. ఏపీలో గతంలో 17 వైద్య కళాశాలల నిర్మాణాన్ని ప్రారంభించారని చెప్పారు. నాలుగేళ్లయినా ఒక్కటీ పూర్తి చేయలేదని మండిపడ్డారు. సగానికి పైగా కళాశాలల నిర్మాణం పునాది దశలోనే ఉందన్నారు. నిర్మాణం పూర్తి కాకుండానే గతేడాది రాజమహేంద్రవరం కళాశాలను ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రస్తుతం రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతి గదులు లేవని.. తాత్కాలిక భవనాల్లో నడపాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. "పులివెందుల వైద్య కళాశాలలో 48 శాతం బోధనా సిబ్బంది లేరు. విద్యార్థులను ఎక్కడ చదివించాలి జగన్ సారూ.. షెడ్ల కిందా? గదులు ఏర్పాటు చేసినా.. పాఠాలు ఎవరు చెబుతారు? మీరు చెబుతారా? విద్యార్థుల భవిష్యత్తుతో ఎందుకు ఆడుకోవాలనుకున్నారు? అసత్యాలు ప్రచారం చేస్తున్నారనే 11 సీట్లు ఇచ్చారు. ప్రజాభిప్రాయాన్ని అర్థం చేసుకుని మారండి" అని సత్యకుమార్ విమర్శించారు.

# సంపద సృష్టిస్తున్నాం.. ప్రజలకు పంచుతున్నాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### పదేళ్ల పాటు కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో పోరాడారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: "పదేళ్ల పాటు కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో పోరాడారు. భారాస ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, కాంగ్రెస్ కార్యకర్తలు భయపడలేదు" అని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు నుంచే హామీలు అమలు ప్రారంభించామన్నారు. "మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ప్రతి నెలా రూ.400 కోట్లు చెల్లిస్తున్నాం. ఒకే విడతలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించాం. ప్రజల కోసం సంపద సృష్టిస్తున్నాం.. మళ్లీ ప్రజలకు పంచుతున్నాం" అని వివరించారు.

### కష్టపడ్డవారిని పార్టీ గుర్తుపెట్టుకుంటుంది: మంత్రి ఉత్తమ్

"సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని మరోసారి రుజువైంది. వెనుకబడిన కులాలకు కాంగ్రెస్ ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. కార్యకర్తల శ్రమ, త్యాగం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కష్టపడి పనిచేసిన వారిని పార్టీ ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందని మరోసారి రుజువైంది. 2029లో రాహుల్ గాంధీ కచ్చితంగా ప్రధాన మంత్రి అవుతారు" అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

# భక్తజన సంద్రం – ఖైరతాబాద్ మహాగణపతి

### ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో భారీగా భక్తులు పోటెత్తారు. శనివారం కంటే ఆదివారం భక్తుల రద్దీ మరింత పెరిగింది. దీంతో ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ తదితర ప్రాంతాలు కిక్కిరిసి పోయి కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. భక్తులు త్వరగా వినాయకుడిని దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. సోమవారం భక్తుల దర్శనాలకు అనుమతులు నిలిపివేసి నిమజ్జనానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేయనున్నారు.

# స్నేహితులతో పందెం కాసి.. కేసీ కాలువలో ఆర్మీ జవాన్ గల్లంతు


### కేసీ కాలువలో ఆర్మీ జవాన్ గల్లంతయ్యాడు. స్నేహితులతో పందెం కాసి పవన్(24) అనే జవాన్ కాలువలో ఈతకు దిగాడు.



కర్నూలు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: కేసీ కాలువలో ఆర్మీ జవాన్ గల్లంతయ్యాడు. స్నేహితులతో పందెం కాసి పవన్(24) అనే జవాన్ కాలువలో ఈతకు దిగాడు. ఆ తర్వాత కాలువలో వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాడు. దీంతో ఈ విషయాన్ని స్నేహితులు పోలీసులకు, స్థానిక అధికారులకు సమాచారమందించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలిలో గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పవన్ జమ్మూలో జవాన్గా పనిచేస్తున్నాడు.

# ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపు ప్రక్రియ.. తీవ్రంగా శ్రమిస్తున్న నిపుణులు

### ప్రకాశం బ్యారేజీ వద్ద ఆరో రోజు భారీ పడవల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది.



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: ప్రకాశం బ్యారేజీ వద్ద ఆరో రోజు భారీ పడవల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. నిపుణులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అబ్బులు బృందం ఇనుప రోప్లు కట్టి పొక్లెయిన్తో బోట్లను లాగుతోంది. మూడు రోజులుగా ప్రయత్నిస్తున్న బోటు 20 మీటర్లు మాత్రమే కదిలింది. అవి ఇసుకలో ఇరుక్కుపోవడంతో తొలగింపు ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. ఇటీవల ప్రకాశం బ్యారేజీ వద్ద వరదకు ఎగువ నుంచి పడవలు కొట్టుకువచ్చాయి. అవి 67, 68, 69 గేట్లను ఢీకొట్టాయి. దీంతో రెండు గేట్లు దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసేందుకు ఉద్దేశపూర్వకంగా వైకాపా నాయకులు చేశారనే అనుమానాలను పలువురు మంత్రులు వ్యక్తం చేశారు. పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.

# రెండ్రోజుల పోలీసు కస్టడీలోకి నందిగం సురేశ్

### తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్ట్ అయిన మాజీ ఎంపీ నందిగం సురేశ్ను విచారణ కోసం మంగళగిరి పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు.



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయిన మాజీ ఎంపీ, వైకాపా నేత నందిగం సురేశు విచారణ కోసం మంగళగిరి పోలీసులు రెండ్రోజుల పోలీసు కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో నందిగం సురేశ్ను అరెస్టు చేసిన తర్వాత పోలీసులు విచారించారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఆయన నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు కస్టడీ కోరుతూ మంగళగిరి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కస్టడీకి అనుమతించింది. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లా జైలు నుంచి నందిగం సురేశ్ను అదుపులోకి తీసుకొని గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మంగళగిరికి తీసుకొచ్చారు. మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఆయనను విచారించనున్నారు. ఈనెల 17 మధ్యాహ్నం ఒంటిగంటకు జిల్లా జైలుకు తరలించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరి పోలీస్ స్టేషన్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

# విశాఖలో మత్స్యకారుల పడవలో అగ్నిప్రమాదం

### జిల్లాలోని ఫిషింగ్ హార్బర్కు చెందిన ఓ బోటులో ఐదుగురు మత్స్యకారులు వేటకు బయలుదేరి వెళ్లారు.



విశాఖ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: జిల్లాలోని ఫిషింగ్ హార్బర్ నుంచి వాసుపల్లి అప్పయ్యమ్మకు చెందిన ఓ బోటులో ఐదుగురు మత్స్యకారులు వేటకు బయలుదేరి వెళ్లారు. తీరానికి 35 మైళ్ల దూరంలో వెళ్లగానే బోటులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇంజిన్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి బోటు పూర్తిగా దగ్ధమైంది. బోటులో ఉన్న ఐదుగురు మత్స్యకారులు సముద్రంలోకి దూకారు. ఇది గమనించిన కోస్ట్ గార్డు సిబ్బంది వారిని రక్షించి మరో బోటులో ఎక్కించి తీరానికి చేర్చారు. ప్రమాదానికి గురైన బోటు విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని మత్స్యకారులు తెలిపారు.

# తదేకంగా సెల్ ఫోన్ చూస్తూ డ్రైవింగ్.. భయాందోళనకు గురైన ప్రయాణికులు



పొదిలి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: ముందు భారీ వర్షం.. రోడ్డు సరిగ్గా కనిపించడం లేదు... వెనుక తనను నమ్ముకుని బస్సులో 45 మంది ప్రయాణికుల నిండు జీవితాలు.. ఇవేమీ ఆ ఆర్టీసీ డ్రైవర్‌కు కనిపించలేదు. రోడ్డుపై ప్రమాదకర డ్రైవింగ్ చేసి అందరినీ భయాందోళనకు గురి చేశాడు. పొదిలి డిపో డ్రైవర్ ఎండీ మస్తాన్ తదేకంగా సెల్ ఫోన్ వైపు చూస్తూ, అందులో కాల్ మాట్లాడుతూ పొదిలి నుంచి ఒంగోలు మధ్య ప్రమాదకరంగా బస్సు నడిపాడు. గత నెల 31న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెల్ ఫోన్ చూస్తూ బస్సు నడపవద్దని ప్రయాణికులు కోరినా డ్రైవర్ పట్టించుకోలేదు. దీంతో బస్సులోని ప్రయాణికులు ఆయన చేష్టలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఇది వైరల్ అయింది. కొన్ని నిమిషాల పాటు సెల్ ఫోన్ వైపు చూస్తూనే ప్రమాదకరంగా బస్సు నడపడం వీడియోలో కనిపించింది. ఘటనపై ఆధారాలతో సహా ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రయాణికులు తెలిపారు. ఈ తరహా డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

# నంద్యాల రెడిమేడ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా పబ్బతి వేణుగోపాల్




నంద్యాల (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 15: నంద్యాల రెడిమేడ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా ఆర్యవైశ్య ప్రముఖులు, శ్రీ వాసవీ యువసేన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ బిల్డర్, పిఏవి గ్రూప్ చైర్మెన్ పబ్బతి వేణుగోపాల్‌ను ఎన్నుకున్నట్లు రెడిమెడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘువీర్ ఫ్యాషన్స్ అధినేత గద్వాల నరసింహరాజు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరసింహరాజు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5.30కి రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ భవనం నందు నంద్యాల రెడిమేడ్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకుంటున్నామని అనంతరం పబ్బతి వేణుగోపాల్‌ను గౌరవాధ్యక్షుడిగా, పబ్బతి వేణుగోపాల్ సతీమణి ప్రముఖ అడ్వకేట్ గొంట్ల అపర్ణను అసోసియేషన్ లీగల్ అడ్వైజరీగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- భారతదేశంలో ఇంజనీర్ల దినోత్సవం.
- 2004: ప్రపంచ చర్మ క్యాన్సర్ అవగాహన దినోత్సవం
- 1861: భారతదేశపు ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జననం (మ. 1962).
- 973: ముస్లిం బహుముఖ ప్రజ్ఞాశాలి అల్ బెరూని జననం (మ. 1048).
- 1254: ప్రపంచ యాత్రికుడిగా ప్రసిద్ధి చెందిన మార్కో పోలో జననం (మ. 1325).
- 1856: పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, వాగ్గేయకారుడు నారదగిరి లక్ష్మణదాసు మరణం (మ. 1923)
- 1876: ఇరవయ్యవ శతాబ్దపు ప్రముఖ బెంగాలీ నవలా రచయిత, కథా రచయిత శరత్ చంద్ర చటోపాధ్యాయ్ జననం (మ. 1938).
- 1890: తెలుగు రంగస్థల నటుడు, తొలితరం చలనచిత్ర నటుడు పులిపాటి వెంకటేశ్వర్లు జననం. (మ. 1972)
- 1931: తొలి తెలుగు టాకీ చిత్రం భక్తప్రహ్లాద విడుదల.
- 1967: తెలుగు, తమిళ, మలయాళ, హిందీ సినిమా నటీమణి రమ్యకృష్ణ జననం.


విశ్వేశ్వరయ్య


ప్రజ్ఞాశాలి అల్ బెరూని


మార్కో పోలో


లక్ష్మణదాసు


శరత్ చంద్ర


వెంకటేశ్వర్లు


టాకీ చిత్రం భక్తప్రహ్లాద



రమ్యకృష్ణ

## "దేవర" ఈ సమయంలో జరిగే కథ..

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం "దేవర" కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం రిలీజ్ కి వస్తుంది. దీనితో అభిమానుల్లో మరింత ఉత్కంఠ నెలకొనగా చిత్ర యూనిట్ సాలిడ్ ప్రమోషన్స్ లో ఇప్పుడు ఫుల్ బిజీగా ఉన్నారు. అయితే ఈ ప్రమోషన్స్ లో ఇంట్రెస్టింగ్ డీటెయిల్స్ మరిన్ని బయటకి వచ్చాయి. అలా ఈ సినిమా కథ ఎప్పుడు జరుగుతుంది అనేది రివీల్ అయ్యింది. ఈ చిత్రం 1980 నుంచి 1990 ల మధ్యలో జరిగే కథగా ఇప్పుడు రివీల్ అయ్యింది. దీనితో దేవర కూడా పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ లోనే రాబోతుంది అని చెప్పాలి. అలాగే మరోపక్క దేవర చిత్రం నిజ జీవిత సంఘటనల ఆధారంగా కూడా తెరకెక్కింది అని పలు రూమర్స్ ఉన్నాయి. మరి దీనిపై రిలీజ్ అయ్యాక క్లారిటీ వస్తుందేమో చూడాలి. ఇక ఈ భారీ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించగా ఈ సెప్టెంబర్ 27న సినిమా గ్రాండ్ గా రిలీజ్ కి వస్తుంది.



## సునీల్ అన్నయ్యను చూసే ఇన్స్పైర్ అయ్యాను - సత్య



సెప్టెంబర్ 13వ తేదీన రిలీజ్ అయిన మత్తు వదలరా 2 చిత్రం ప్రేక్షకులను బాగా అలరిస్తుంది. స్టార్టింగ్ నుండి ఎండింగ్ వరకు ఫన్ రైడ్ తో ఆకట్టుకుంటుంది అని ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు కూడా తెలిపారు. అయితే ఈ చిత్రంలో శ్రీ సింహ కోడూరి తో పాటుగా, ప్రధాన పాత్రలో నటించిన కమెడియన్ సత్య పాత్ర పై ఆడియెన్స్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అయితే సక్సెస్ మీట్ లో సునీల్ తనకు ఇన్స్పిరేషన్ అని సత్య తెలిపాడు. తనకు చాలా వరకు సునీల్ సలహాలు ఇచ్చాడు అంటూ చెప్పుకొచ్చాడు. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, సునీల్, ఫరియా అబ్దుల్లా లు కీలక పాత్రల్లో నటించారు. క్లాప్ ఎంటర్ టైన్మెంట్ మరియు మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్లపై నిర్మించిన ఈ చిత్రానికి కాల భైరవ సంగీతం అందించాడు. ఈ చిత్రం లాంగ్ రన్ లో బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రిపబ్లిక్ సినిమా CINEMA

## నానీ... ఈ రోజు నుంచి అన్నా అనే పిలుస్తా: విజయ్ దేవరకొండ



సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) వేడుక దుబాయి వేదికగా అట్టహాసంగా జరిగిన విషయం తెలిసిందే. టాలీవుడ్కు సంబంధించి 'దసరా', 'బేబీ, 'హాయ్ నాన్న' చిత్రాలు వరుస అవార్డులు సొంతం చేసుకున్నాయి. 'దసరాస చిత్రానికిగాను ఉత్తమ నటుడిగా నాని అవార్డు దక్కించుకున్నారు. విజయ్ దేవరకొండ చేతుల మీదగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. అనంతరం విజయ్.. నానితో కలిసి వర్క్ చేసిన 'ఎవడే సుబ్రహ్మణ్యం' షూట్ రోజులను గుర్తు చేసుకున్నారు. కెరీర్ తొలినాళ్లలో యాక్టింగ్ పరంగా నాని తనకెంతో సాయం చేశారని, అండగా నిలిచారని తెలిపారు. ఇకపై ఆయన్ని అన్నా అని పిలుస్తానన్నారు. "ఎవడే సుబ్రహ్మణ్యం'లోనే తొలిసారి నేను కీలక పాత్ర పోషించా. ఆడిషన్లో భాగంగా నాని ఆఫీస్కు వెళ్లా. ఆయనతో ఆడిషన్ అని తెలిసి ఆనందించా. అలాగే కాస్త కంగారుపడ్డా. నటీనటులు ఎవరికైనా తొలి చిత్రం ఎప్పటికీ గుర్తు ఉంటుంది. ఎన్నో మధుర జ్ఞాపకాలు అందిస్తుంది. ఆ సమయంలో ఆయన ఎంతో సపోర్ట్ చేశారు. నానీ.. ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే ఉంటా. నీపై నాకు అమితమైన గౌరవం, ప్రేమ ఉన్నాయి. ఇండస్ట్రీలో అందరినీ అన్నా, అన్నా అని పిలుస్తుంటా. కానీ, ఎందుకు పిలుస్తున్నానో తెలియదు. నేటి నుంచి నిన్ను నాని అన్నా అని పిలవాలనుకుంటున్నా. నువ్వు వరుస విజయాలు అందుకోవడం నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేడు నీకు అవార్డు అందించడం సంతోషంగా ఉంది" అని విజయ్ దేవరకొండ అన్నారు. నాని మాట్లాడుతూ.. "విజయ్ చేతుల మీదగా ఈ అవార్డు అందుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది. మేమిద్దరం కలిసి వర్క్ చేసినప్పుడు సినిమా గురించి ఎన్నో విషయాలు మాట్లాడుకునేవాళ్లం. తరచూ సందేహాలు అడుగుతూ ఉండేవాడు. ఏదో ఒకటి నేర్చుకోవాలనే తపన ఉన్న వ్యక్తి తను. వచ్చే ఏడాది ఇదే స్టేజ్పై మా గౌతమ్ తిన్ననూరి చిత్రానికి నేను నీకు ఈ అవార్డు ఇస్తా. నువ్వు ఫిక్స్ అయిపో" అని నాని తెలిపారు. 'దసరా'తోపాటు అవార్డులు అందుకున్న అన్ని చిత్రబృందాలకు ఆయన అభినందనలు తెలిపారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## దులీప్ ట్రోఫీ.. ఇండియా ఎ విజయం..

## మరో మ్యాచ్ డ్రా

దులీప్ ట్రోఫీలో భాగంగా ఇండియా డితో జరిగిన మ్యాచ్లో ఇండియా ఎ విజయం సాధించింది.



దులీప్ ట్రోఫీలో భాగంగా ఇండియా డితో జరిగిన మ్యాచ్లో ఇండియా ఎ 186 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇండియా డి 488 పరుగుల లక్ష్యఛేదనలో 62/1తో నాలుగో (చివరి) రోజు ఆటను కొనసాగించి 301 పరుగులకు ఆలౌటైంది. రికీ భుయ్ (113బీ 195 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సు) శతకం బాదాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (41బీ 55 బంతుల్లో 8 ఫోర్లు), సంజు శాంసన్ (40బీ 45 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సు) రాణించారు. తనుష్ కొటియన్ 4, ప్రసిద్ధ కృష్ణ 3, ఖలీల్ అహ్మద్, రియాన్ పరాగ్ తలో వికెట్ పడగొట్టారు.

స్కోర్లు..

ఇండియా ఎ: తొలి ఇన్నింగ్స్ 290 ఆలౌట్.. రెండో ఇన్నింగ్స్ 380/3 డిక్లేర్

ఇండియా డి: తొలి ఇన్నింగ్స్ 183 ఆలౌట్.. రెండో ఇన్నింగ్స్ 301 ఆలౌట్

### ఇండియా బి, ఇండియా సి మ్యాచ్ డ్రా

ఇండియా బి, ఇండియా సి మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆదివారం, చివరి రోజు 309/7 స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇండియా బి.. 332 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్ (157లిబీ 286 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. ఇండియా సి బౌలర్ అంశుల్ కాభోజ్ (8/69) అదరగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ను ఆరంభించిన ఇండియా సి 128/4 వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (62బీ 93 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) వరుసగా రెండో అర్ధ శతకం బాదాడు. రజత్ పటీదార్ (42బీ 84 బంతుల్లో 5 ఫోర్లు) రాణించాడు. ఇండియా బి రెండో ఇన్నింగ్స్ ఆడినా ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్లో ఇండియా సి 525 పరుగులు చేసింది.

హెల్త్

# జీర్ణ సమస్యలు దూరమవ్వాలంటే పాలలో ఈ పొడులు కలిపి తాగండి

పాలు ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని తాగడం వల్ల ఎన్నో లాభాలున్నాయి. అయితే, వీటిలో కొన్ని పదార్థాలు వేసుకుని తాగితే మరీ మంచిది. అవేంటంటే.. సీజన్ మారేకొద్దీ జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలొస్తాయి. వాటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. డైట్‌లో కొన్ని మార్పులు చేసుకోవాలి. అందులో భాగంగా రోజూ పడుకునే ముందు పాలలో కొన్ని పదార్థాలు కలిపి తాగాలని చెబుతున్నారు నిపుణులు అవేంటో తెలుసుకోండి.



### పసుపు పాలు..

పసుపు పాలని గోల్డెన్ మిల్క్ అంటారు. ఈ పాలు తాగడం వల్ల వర్షాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి గొంతునొప్పి, దగ్గు, జలుబు, ఇన్‌ఫ్లమేషన్‌ని దూరం చేస్తుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది. ఇందులో కావాలనుకుంటే క్యారెమ్ సీడ్స్, దాల్చిన చెక్క, నల్ల మిరియాలు వంటివి యాడ్ చేసుకోవచ్చు.



### బాదం మిల్క్..

బాదంలో ఎక్కువగా ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఈ, ఇతర పోషకాలు ఉంటాయి. బాదంని పొడిలా చేసి పాలలో కలిపి తాగడం వల్ల యాంటీ ఆక్సిడెంట్స్ అందుతాయి. దీంతో చాలా చాలా సమస్యలు దూరమవుతాయి.



### మసాలా పాలు..

మన ఇంట్లో చాలా రకాల మసాలా పదార్థాలు ఉంటాయి. ఇందులో ఎన్నో అద్భుత గుణాలు ఉంటాయి. యాలకులు, పసుపు, అల్లంని వేడి పాలలో వేసుకుని తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవ్వడంతో పాటు చాలా లాభాలున్నాయి.



### వీటిని కూడా ట్రై చేయొచ్చు..

ఇప్పుడు చెప్పినవి మాత్రమే కాకుండా వర్షాకాలంలో కొన్ని డ్రింక్స్ కూడా ట్రై చేయొచ్చు. అవి కేసర్ మిల్క్, హనీ మిల్క్, హాట్ చాక్లెట్ మిల్క్, అల్లం నిమ్మ టీ, బ్లాక్ కాఫీతో దాల్చిన చెక్క పొడి కలిపి తీసుకోవచ్చు. వీటి వల్ల సీజన్‌లో వచ్చే చాలా సమస్యల్ని మనం తప్పించుకోవచ్చు.

